నేత్రదానం



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కుటుంబసభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలకు చెందిన మోతె రాజమల్లు అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కళ్లను కుటుంబీకులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కైలాసం సమ్మయ్య నేత్రదానంపై కుటుంబానికి అవగాహన కల్పించగా వారు నేత్రదానికి ఒప్పుకున్నారు. దీంతో ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో ఎల్‌వీపీ టెక్నిషియన్ ప్రదీప్‌నాయక్ కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు. నేత్రదానం చేసిన మృతుడి భార్య రాంబాయి, కుమారుడు రాందాసు, సత్యనారాయణ, కుమార్తె ఉమాదేవి, కుటుంబీకులకు ఫౌండేషన్ సభ్యులు రాంరెడ్డి, శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, భీష్మచారి, వాసు, రామకృష్ణరెడ్డి అభినందించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

వేమనపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం గ్రామంలోని భక్త వీరాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామస్థులు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థుల కోసం 'శ్రేష్ట'

- సీబీఎస్ఈ బోర్డుతో అనుసంధానం
- 9 నుంచి 12 తరగతుల వారికి కేంద్రం చేయూత
- బ్రిడ్జి కోర్సుతో సామర్థ్యం పెంచేందుకు చర్యలు
- నెట్స్ ద్వారా ప్రతిభగల విద్యార్థుల ఎంపిక
- ఈ నెల 30 వరకు తుది దరఖాస్తు గడువు



మంచిర్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలకు చెందిన ప్రతిభగల విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'శ్రేష్ట' (స్కీం ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్స్ ఇన్ టార్గెట్ ఏరియాస్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. దేశవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీవోస్) నిర్వహించే గ్రాంట్ ఇన్ ఎయిడ్ విద్యాసంస్థలు, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించే రెసిడెన్షియల్ స్కూళ్లలో సులభంగా ప్రవేశం కల్పించి, విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు అవకాశాలను కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. షెడ్యూల్ కులాల ఆధిపత్యం ఉండి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు విస్తరించడం ద్వారా విద్యారంగంలో ఉన్న లోటును పూడ్చేందుకు ఉద్దేశించబడింది.

● **ఎవరు అర్హులు...**

పథకం ద్వారా ఎస్సీ సామాజిక వర్గాల సమగ్ర అభివృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం తనవంతు కృషి చేస్తోంది. పథకంలో చేరే విద్యార్థులకు సీబీఎస్ఈతోపాటు పథకం అమలులో ఉన్న రాష్ట్రాల బోర్డుకు అనుసంధానమై ఉన్న అత్యుత్తమ ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలల్లో 9, 11 తరగతుల్లో ప్రవేశం కల్పించడం ద్వారా 12వ తరగతి వరకు విద్య పూర్తి చేసేందుకు ఆర్థిక సహాయం అందజేస్తారు. స్వచ్ఛంద సంస్థలు, వలంటరీ ఆర్గనైజేషన్స్ నిర్వహించే రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లకు సైతం తగిన సదుపాయలు, మంచి విద్యా ప్రమాణాలు కలిగి ఉన్న వాటికి ఆర్థిక సహాయం అందజేస్తారు. పథకంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన 'బ్రిడ్జి' కోర్సుల ద్వారా విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల వాతావరణానికి సులువుగా అలవాటు పడేందుకు, ఇతర విద్యార్థులతో సమానంగా పాఠ్యాంశాలు అర్థం చేసుకునే సామర్థ్యం పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులు. ఇందు కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల్లో 9వ తరగతికి రూ. 1,00,000, 10వ తరగతికి రూ. 1,10,000, 11వ తరగతికి రూ. 1,25,000, 12వ తరగతికి రూ. 1,35,000 వార్షిక ఫీజు ఉండగా, ప్రతీ విద్యార్థికి పాఠశాల ఫీజు (ట్యూషన్ ఫీజు)తో సహా హాస్టల్ ఫీజు (మెస్ చార్జీలు)ను కూడా ప్రభుత్వంలోని సామాజిక న్యాయశాఖ భరిస్తుంది.

● **రెండు విధానాల్లో అమలు...**

మొదటి విధానంలో... ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా ప్రతిభావంతులైన ఎస్సీ విద్యార్థులకు నెట్స్ (నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ట) ద్వారా నేషనల్ టెస్టింగ్ ఎంపిక చేస్తుంది. ఎంపికైన విద్యార్థులకు సీబీఎస్ఈ/రాష్ట్ర బోర్డు అనుసంధానం కలిగిన ప్రైవేట్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రవేశం కల్పిస్తారు.

రెండో విధానంలో... ఎన్‌జీవోస్ నిర్వహించే విద్యారంగంలోని పాఠశాలలు/హాస్టల్ ప్రాజెక్టులకు ఆర్థికం సహాయం అందజేస్తారు. ఈ పథకంలో భాగంగా..

(మిగతా 7లో..)

అకాల వర్షం... పంటలకు నష్టం



గొల్లపల్లిలో నేలవాలిన పొలాన్ని చూపుతున్న రైతు

నెన్నెల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలు చేతికొస్తున్న సమయంలో అకాల వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. చేలల్లో సేకరించడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసిపోయింది. ఇప్పుడిప్పుడే పత్తి సేకరణ ప్రారంభమవుతుండగా, వానతో పత్తి నల్లబారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. తడిసిన దూది పింజలు నీటి బరువుతో చెట్టు నుంచి జారి నేల రాలుతుందని తెలిపారు. కిందపడిన పత్తి పనికి రాదని చెప్పారు. నాణ్యత బాగుంటేనే కొర్రీలు పెట్టే సీసీఐ అధికారులు, వ్యాపారులు వర్షంలో తడిసిందనే నెపంతో ధరలో తీవ్రంగా కోతలు విధిస్తారని రైతులు వాపోతున్నారు. మరోవైపు కోతకొచ్చిన వరిపొలాలు వాన ధాటికి నేలవాలాయి. వరి గింజలు రాలిపోయాయి. పొలాల్లో నిలిచిన వరద నీటిలో కంకులు మునగడంతో ధాన్యం నల్లబడి పనికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో నీరు చేరి కంబైన్డ్ హార్వెస్టర్లు దిగబడే పరిస్థితి నెలకొనడంతో కోతలు నిలిచిపోయాయని చెప్పారు. మరో రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు ఉన్నాయనే వాతావరణశాఖ ప్రకటనతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



నందులపల్లిలో వర్షానికి తడిసిన పత్తి

బాల సదన్ భవన నిర్మాణపనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ కుమార్ దీపక్



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లో రూ. 1.34 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాల సదనం భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లో కొనసాగుతున్న బాల సదనం నిర్మాణ పనులను కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ, ఆశ్రమం కోసం ప్రభుత్వం కోటి 34 లక్షల నిధులు మిషన్ వాత్సల్య ద్వారా మంజూరు చేసిందన్నారు. దీంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నయన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

క్రికెట్‌లో యువత జాతీయస్థాయికి ఎదగాలి

-రూ. 26 లక్షలతో క్రీడా మైదానం అభివృద్ధి ● పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంచుకుని జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఆడేలా ఎదగాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి అన్నారు. కాసిపేట మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన కేఎంపీఎల్ (కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ మిని సీజన్ 1) ముగింపు పోటీలకు వారు హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని పునాదిగా చేసుకుని గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఓడిన పల్లంగూడ టైటాన్స్ జట్టు మళ్లీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. విజేతగా నిలిచిన సీఎస్‌కే జట్టును ఎంపీ అభినందించారు. క్రీడా మైదానానికి ఎంపీ నిధుల నుంచి రూ. 26 లక్షలు కేటాయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎంపీ హామీఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి మరిన్ని నిధులు సమకూర్చి మైదానాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్

-విజేత సీఎస్‌కే జట్టు..

మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో నెల రోజుల పాటు జరిగిన కేఎంపీఎల్ (కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ మిని సీజన్ 1)లో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొనగా పల్లంగూడ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు ఫైనల్‌కు చేరుకుని ఆదివారం తలపడ్డాయి. సీఎస్‌కే జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 70 పరుగులు చేసింది. బరిలోకి దిగిన పల్లంగూడ టైటాన్స్ జట్టు 62 పరుగులు చేసి ఓడింది. విజేత జట్టుకు 40 వేల రూపాయల నగదు, ట్రోఫీని అందజేశారు. రన్నర్ జట్టుకు రూ. 30 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. క్రీడాకారులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీఎస్‌కే ఫ్రాంచైజ్ ఓనర్ ఎస్‌కె మూర్తుజా, పల్లంగూడ టైటాన్స్ ఓనర్ దుస్స చందు, స్థానిక నాయకులు అప్పాల శేఖర్, నస్పూరి నర్సింగ్, నిర్వహకులు సునీల్, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భగవద్గీత జ్ఞాన ప్రచారం

దండేపల్లి, అక్టోబరు, 26 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల జ్ఞాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు భగవద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం సభ్యులు ప్రజలకు భగవద్గీతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాజు, రాకేష్, నాగిరెడ్డి, రవి, వేణు, సత్యం, సందీప్, ప్రసాద్, సతీష్, నాగేందర్, ఉమ, సునీత, నాగమణి, రవళి, రక్షిత తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీతను పంపిణీ చేస్తున్న సభ్యులు

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్



రఘునాథ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జన్నారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీదే పైచేయి కావాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికై మండల కేంద్రానికి మొదటిసారి రావడంతో ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, రాబోయే కాలంలో కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటుందన్నారు. రానున్న స్థానిక సంస్థల్లో ప్రతి కార్యకర్త సైనికుడి వలే పనిచేసి బీజేపీని గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా వెనుకబడి పోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రితీష్‌రాథోడ్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, నాయకులు శంకరయ్య, రమేష్‌గౌడ్, బద్రినాయక్, ప్రహల్లాద్, రమేష్, దస్తూరాబాద్, కడెం, ఖానాపూర్, ఉట్నూరు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వెంకట కృష్ణారెడ్డి



హాజీపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ ఎంపీడీవోగా సాయి వెంకట కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. రాజేంద్రనగర్‌లోని రూరల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందారు. రెండేళ్ల అనంతరం హాజీపూర్‌కు రెగ్యులర్ ఎంపీడీవో రానున్నారు.

గూడెంలో భక్తుల సందడి

దండేపల్లి, అక్టోబరు, 26(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సత్యదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించారు.





సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరిస్తున్న దంపతులు, సత్య దేవుడిని దర్శించుకుంటున్న భక్తులు

గాలికుంటు వ్యాధిపై టీకాస్త్రం

- ముందు జాగ్రత్తతోనే పశువుల్లో వ్యాధి నివారణ
- జిల్లాలో 2.42 లక్షల డోసులు వేయడమే లక్ష్యం
- గ్రామాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరాలు

నెన్నెల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలి కుంటు వ్యాధి (ఫూట్ అండ్ మౌత్ డిసీజ్) సోకుతుండటంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. పాల దిగుబడి తగ్గడం.. సాగు పనులు చేసే ఎడ్లు నీరసించి పోవడంతో రైతులు ఆర్థికంగా నష్టతున్నారు. గొర్రెలు, మేకల మందల్లో ఈ వ్యాధి సోకి మరణాలు సంభవిస్తున్నాయి. అన్ని విధాల నష్టపరిచే గాలికుంటు వ్యాధి ముందు జాగ్రత్త చర్యలు చేపడితే సమర్థవంతగా నివారించవచ్చని పశువైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం తరపున ఉచితంగా టీకాలు వేసే వైద్య శిబిరాలు జిల్లాలో అక్టోబరు 15 నుంచి ప్రారంభం కాగా నవంబరు 14 వరకు కొనసాగుతాయి. జిల్లాలో 2,42,663 పశువులకు టీకాలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా అంతట కార్యక్రమం నిర్వహిస్తునట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గాలి కుంటు వ్యాధి లక్షణాలు.. వ్యాధితో జరిగే నష్టం.. నివారణ చర్యల గూర్చి తెలుసుకుందాం...



పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శంకర్ (ఫైల్)

● **వ్యాధి లక్షణాలు**

- చీలిక గిట్టలున్న పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి.
- ఆఫ్తో వైరస్ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒక పశువునుంచి మరోదానికి అతి తక్కువ కాలంలో సంక్రమించే అంటు వ్యాధి. ఈ వ్యాధితో మరణాల శాతం తక్కువగానే ఉన్నప్పటికి పశువుల్లో ఉత్పాదకశక్తి సామర్థ్యం కుంటు పడుతుంది. గాలి కుంటు వ్యాధి యుక్త వయసు ఉన్న పశువులు, బలహీనంగా ఉండి వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండే పశువుల్లో, దేశావాళి పశువుల కంటే సంకర జాతి పశువుల్లో ఎక్కువ కనబడుతుంది.
- పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.
- నోటి ఇఫిథీలియం, పళ్ల చిగుళ్లు నాలుక లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులకు నొప్పి వస్తుంది. దీంతో పశువులు మేత ముట్టవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి ఆతరువాత అవి చితికి పోవడం వల్ల నొప్పితో పశువులు కుంటుతూ నడుస్తాయి.
- పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కో సారి పొదుగుకు వాపు వస్తుంది.
- వ్యాధి సోకిన పశువు దూడలకు పాలు పడితే అవి మృత్యువాత పడుతాయి. ఎడ్లు వ్యవసాయ పనులు చేయలేకుండా నీరసించి పోతాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి అకాస్మత్తుగ తగ్గిపోతుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు అవుతాయి.
- పశువుల్లో రక్తహీనత కలుగుతుంది. శ్వాస కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండవేడిమికి నీరసిస్తాయి.

● **వ్యాధి నివారణ**

- గాలికుంటు వ్యాధి నిరోదక టీకాలు మొదటి సారి 3 నెలల వయసులోనే వేయించాలి. ఆ తర్వాత ప్రతి ఏటా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.
- ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధిసోకిన వాటిని సుమారు 3 నెలల పాటు సంపర్కానికి వినియోగించకూడదు.
- పాలుతాగే దూడలకు వ్యాధి సోకకుండా ఉండేదుకు దూడలు కలుషితమైన పాలు తాగకుండా జాగ్రత్త పడాలి. మనుషులు సైతం ఆ పాలను మరగకాచి వినియోగించాలి. పశువులన్నింటికి..

(మిగతా 7లో..)

ఏడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా వాయిదా

ఆసిఫాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏడు దుకాణాలకు లక్కీ డ్రా వాయిదా వేస్తున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ హైదరాబాద్ ఆదేశాల మేరకు దరఖాస్తులు తక్కువ వచ్చిన దుకాణాలకు డ్రా వాయిదా వేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో రెబ్బెన, గోలేటి, రవీంద్రనగర్, జైనూర్-1, జైనూర్-2, సిర్పూర్(యు), కాగజ్‌నగర్(సర్‌సిల్క్ ఏరియా), దుకాణాలకు లక్కీడ్రా వాయిదా వేశామని తెలిపారు. మిగిలిన 25 దుకాణాలకు సోమవారం లక్కీ డ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయా దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని జిల్లా ఎక్సైజ్ అధికారి సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాండూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ని రెబ్బెన మండలం నుంచి తాండూర్ మండలానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆదివారం కొందరు ట్రాక్టర్ యాజమానులు పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించారు. మైనింగ్ అధికారులు ఇసుక ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. రెబ్బెన మండలం నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుకను ప్రైవేటు జిన్నింగు మిల్లులకు పదుల సంఖ్యలో ప్రతి రోజు ఇసుక ట్రిప్పులు చేస్తున్నారని ట్రాక్టర్ యాజమానులు పేర్కొన్నారు. మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లా డుతూ ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

- అర్హత ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు
- పదోన్నతులకు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు



కాగజ్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. దేశ వ్యాప్తంగా పని చేస్తున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీచర్ ఎలిబిటి టెస్ట్(టెట్)ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు వెలువరించిన తీర్పుతో జిల్లాలోని ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొంది. 2009 రైట్ టు ఎడ్యూకేషన్(ఆర్‌టీఈ) చట్టం అమలులోకి వచ్చిన తర్వాత నియమించబడిన ఉపాధ్యాయలందరు రెండు సంవత్సరాల్లోగా టెట్ పరీక్ష ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది. లేని పక్షంలో ప్రమోషనలు పొందటం మార్గం ఉండదని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనడంతో టెన్షన్ మొదలైంది. జిల్లాలో 800 మంది ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఈ తీర్పు ప్రభావితం చేయనున్నది.. కాగా ఉద్యోగ విరమణకు ఐదేళ్ల సర్వీసులోపు ఉన్న టీచర్లు మినహాయించి మిగితా అంతా టెట్‌పరీక్ష ఉత్తీర్ణత కావాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం ఇప్పుడు విద్యాశాఖలోకలకలం రేపుతోంది. ప్రస్తుతం ఈ తీర్పు ప్రతుల కాపీలపైనే జోరుగా చర్చా సాగుతోంది. టెట్‌పరీక్ష అర్హత లేకుంటే ఉపాధ్యాయులకు ప్రమోషన్ల అవకాశం ఉండదు. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో ఆయా సంఘాల నాయకులు భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి సారిస్తున్నారు.

విద్యాహక్కు చట్టం అమల్లోకి..

విద్యాహక్కు చట్టాన్ని 2009లో అమల్లోకి తెచ్చింది. దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులందరికి ఒకే రకమైన విద్యార్హత, ప్రమాణాలుండాలని ఇందుకు సంబంధించిన విధి విధానాలను విద్యా హక్కు చట్టంలో పేర్కొన్నది. దీంతో 2010 నుంచి నిర్వహించిన టీచర్ల నియామకాల్లో నేషనల్ కౌన్సెల్‌ఫర్ టీచర్ ఎడ్యూకేషన్ (ఎన్‌సీటీఈ) టెట్‌పరీక్షను తప్పసరి చేయగా, ముందు గా టెట్ రాసి అందులో ఉత్తీర్ణులైన వారు డీఎ స్సీ రాసి ఉద్యోగాలు పొందారు. కాని 2010 కన్నా ముందు సర్వీసులోఉన్న టీచర్లు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంలో కొనసాటానికి టెట్‌పరీక్ష రాయాలని ఎన్‌సీటీఈ ఎక్కడా పేర్కొనలేదు. దీంతో ప్రమోషన్ పొందటానికి మాత్రమే టెట్ రాయటం జరిగేది. కాని ఇటీవల టెట్‌రాస్తేనే ఉద్యోగం ఉంటుందన్న ఉత్తర్వులు ఉపాధ్యాయులనుకంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఎందుకంటే ప్రస్తుతం నిర్వహిస్తున్న టెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే కేటగిరిల ఓసీలకు 90 శాతం, బీసీలకు 75, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం తెచ్చుకోవాల్సి ఉంటుంది. 2010 కన్నా ముందున్న ఇన్ సర్వీసు టీచర్లంతా తమను టెట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎన్‌సీటీఈకి ఆ యా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ విజ్ఞప్తి తిరస్కరించినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. 2010 కన్నా ముందు డీఎస్సీల్లో ప్రాథమిక పాఠశాలల్లో నియమితులైన వాళ్లలో ఎక్కువ మంది బీఈడీ పూర్తి చేసిన వారు ఎక్కువ మంది ఉన్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గతంలో సర్వీసులో కొనసాగుతున్న టీచర్ల విద్యార్హతల గురించి కూడా చర్చ నడుస్తోంది.

చొరవ చూపాలి..

ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. టెట్ అర్హతపై సడలింపులు లేదా ప్రత్యామ్నాయ పరిష్కారాలు అవసరమని ఒత్తిడి చేస్తున్నారు. ఎప్పుడో చదువుకున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ అర్హత చేయడం సరి కాదంటున్నారు. గతంలో ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారమే తాము కొనసాగుతున్నామని చెబుతున్నారు. కాగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రమోషన్లు పొందకుండా సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఉపాధ్యాయుల కొలువుల్లో కొనసాగడానికి టెట్ రాయాల్సి ఉందన్న ఆదేశాలతో ఉద్యోగ భద్రతపై సందేహాలు నెలకొన్నాయి. మారిన కాలనుగుణంగా టెట్‌పరీక్ష ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు ఉండడంతో పాటు అర్హత సాధించేందుకు కూడా ఎక్కువ మార్కులు రావాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో విద్యను అందించే టీచర్లు తమ ఉద్యోగాన్ని నిలుపుకునేందుకు మరోసారి పరీక్ష రాయడమేంటని ప్రశ్నిస్తున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ఎనిమిది మంది రిమాండ్



గుప్త నిధుల తవ్వకాల్లో పట్టుబడిన నిందితులు

సిర్పూర్(టి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎఫ్ఆర్వో తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలం హీరాపూర్‌కు చెందిన నన్న రాజేష్(రాజు) గతంలో ఓ కేసులో జైలుకు వెళ్లగా కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన రాంటెంకి రాహుల్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అటవీ ప్రాంతంలో గుప్త నిధులు ఉన్నాయని జైలు నుంచి విడుదల అయ్యాక నీకు చూపిస్తానని రాహుల్‌తో నన్న రాజేష్‌కు చెప్పాడు. రాజేష్ జైలు నుంచి విడుదలయ్యాక లక్ష్మీపూర్ శివారు అటవీ ప్రాంతంలో ఓ చోట తవ్వి అందులో రాళ్లకు బంగారం రంగు పెయింట్ పూసి కొన్ని ఫొటోలు, వీడియోలు తీసి రాంటెంకి రాహుల్‌కు పంపించాడు. నిజమేనని నమ్మిన రాహుల్ ఈ నెల 20న కిశోర్, చల్లురకర్ సాజన్, రాంటెంకి సునీల్, కన్కి గ్రామానికి చెందిన దుర్గం రాజారాంలతో కలిసి నిధుల కోసం తవ్వకాలు జరపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లగా అటవీ అ ధికారులకు పట్టుబడ్డారు. అటవీ అధికారులు విచారణ జరిపి అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి త్వకాలు జరిపినందుకు జంతువుల ఆవాసాలకు ధ్వంసం చేసినందుకు, వాటి సంచారా నికి ఇబ్బంది కలిగించినందుకు కేసు నమోదు చేసి శనివారం రాత్రి సిర్పూర్(టి) మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా వారికి 13 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేసు విచారణలో డీఆర్వో శశిధర్‌బాబు, బీట్ ఆఫీసర్లు హబీబా, రవీనా, నరేష్, అరవింద్ పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో వరిపంట ధ్వంసం

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిగూడెంలోని రైతు మడావి వెంకటేష్‌కు చెందిన వరి పంటపై అడవి పందులు శనివారం రాత్రి దాడి చేశాయి. చేతికి వచ్చిన వరి పంటపై ధ్వంసం కావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి అడవి పందులు పంటలు ధ్వంసం చేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అన్వేష్(ఫైల్)

దండేపల్లి, అక్టోబరు, 26 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గుడిరేవకు చెందిన చిట్ల అన్వేష్(22) అనే యువకుడు మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై తహసీయోద్దీన్, మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. అన్వేష్ డిగ్రీ చదువుతున్నాడు. కొన్ని రోజులుగా టూర్ వెళ్తానని ఇంట్లో డబ్బులు అడగగా తండ్రి ఇవ్వలేదు. ఈనెల 11వ తేదీన అన్వేష్ టూర్ కోసం డబ్బులు అడగడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారులోని పోచమ్మ గుడి వద్ద పురుగుల మందు తాగి ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. గమనించిన స్నేహితులు, యువకుడి కుటుంబీకులు ఘటనా స్థలానికి వెళ్లి అన్వేష్‌ను చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండగా వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి, అక్కడి నుండి సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు అన్వేష్ తండ్రి రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి విద్యార్థి మృతి



కార్తీక్(ఫైల్)

భీమిని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భీమిని ఎర్ర వాగులో ప్రమాదవశాత్తు పడి ఆదివారం ఏడో తరగతి విద్యార్థి చిర్రం కార్తీక్ (14) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కుర్మగూడెం కు చెందిన చిర్రం తిరుపతి పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిలో చిర్రం కార్తీక్ చిన్న కుమారుడు. కార్తీక్ ఆదివారం ఉదయం బహిర్భూమికి గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లి అందులో జారి పడి మృతి చెందాడు. చేను పనులకు వెళ్తున్న స్థానికులు కార్తీక్‌ను గుర్తించి కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కార్తీక్ స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. చిన్ననాటి నుంచి కార్తీక్ మానసిక వికలాంగుడితో పాటూ మూర్చ వ్యాధి ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. ప్రతీ రోజూ పాఠశాలకు వెళ్లివచ్చే వాడని వారు పేర్కొన్నారు. తన కుమారుడి మృతదేహం చూసి తల్లి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతుడు కార్తీక్ తండ్రి చిర్రం తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

ఎస్టీపీపీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్



అధికారులకు సూచనలు ఇస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

జైపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని ఎస్టీపీపీని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్‌ప్లానింగ్ వెంకటేశ్వర్లు ఆదివారం సందర్శించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు డైరెక్టర్‌కు పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. 1ఇన్‌టూ 800 మెగావాట్ల ప్లాంట్‌పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో ప్లాంట్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మిథనాల్‌ప్లాంట్‌ను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశిం చారు. అనంతరం ప్లాంటు నిర్మాణ పనులను పరిశీలించి సూచ నలు చేశారు. కార్యక్రమంలో అధికారులు మదన్‌మోహన్, పంతుల, అప్పారావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీలకు సన్నద్ధం



నృత్యం చేస్తున్న కళాకారులు

మందమర్రిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా పోటీల్లో బహుమతులు సాధించడమే లక్ష్యంగా సింగరేణి వాయిద్య కళాకారులు, నృత్య కళాకారులు సన్నద్ధమవుతున్నారు. సీఈఆర్ క్లబ్‌లో వాయిద్యాలతో సాధన చేస్తున్నారు. వారితోపాటు నృత్య కళాకారులు నృత్యంలో సాధన చేస్తున్నారు. రోజు రెండు, మూడు గంటల పాటు సాధన చేస్తూ కోలిండియాలో బంగారు బహుమతి సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. నవంబర్ 4, 5 తేదీల్లో మందమర్రిలో కంపెనీ లెవల్ సంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. దీనిలో వీరు పాల్గొని గెలిచి కోలిండియాకు ఎంపికై పతకాలు సాధించడానికి కృషి చేస్తున్నారు. కళాకారులు సాధన వేని ప్రభాకర్, ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, హేమంత్, సంపత్‌లు పతకాలు సాధించడానికి చెమటోడుస్తున్నారు. వీరికి యాజమాన్యం ప్రోత్సాహాన్ని అందిస్తున్నది

యువతకు ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయం



ఉద్యోగం సాధించిన యువతికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం రాధాక్రిష్ణ

బెల్లంపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మెగా జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ, ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం రాధాక్రిష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంసీ క్రీడా మైదానంలో సింగరేణి సంస్థ నోబుల్ ఎడ్యూకేషనల్ ఎన్‌పవర్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మెగాజాబ్‌మేళాలో నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవడం సంతోషం అన్నారు. ప్రస్తుత తరుణంలో ఉద్యోగాలు సాధించాలంటే ఎంతో కష్టప్రయత్నంలో బెల్లంపల్లి పట్టణంలో మెగాజాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాల కల్పనకు కృషి చేశామన్నారు. ఉద్యోగాలు సాధించినవారందరూ కష్టపడి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యాపార రాజకీయ ఉద్యోగ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొంటుందని అందుకు తగిన విధంగా నేటి యువత సిద్ధం కావాలన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన యువతకు ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, సింగరేణి ప్రాజెక్టు డైరెక్టర్, జీఎంలు నియామకపత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో దాదాపు 4వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని ఈ జాబ్‌మేళాకు దా దాపు నాలుగు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఏరియాల వారీగా లక్ష్యాలను అధిగమించాలి



కేకే ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు

మందమర్రిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఏరియాల వారీగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలతో పాటు అదనపు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మంద మర్రి ఏరియాలోని కేకే ఓసీపీని సందర్శించారు. ఏరియా జీఎం రాధా కృష్ణను వివరాలు అడిగి తెలుసు కు న్నారు. ఈ సందరర్భంగా ఆయన మా ట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన ఉత్పత్తిని ప్రణాళికాబద్ధంగా సాధించారని చెప్పారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తే సింగరేణి అభివృద్ధిలో ముందుంటుందన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలని పిలుపునిచ్చారు. సంస్థను ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలపాలని తెలిపారు. సింగరేణి అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆయన సూచింలచారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీధర్‌గౌడ్, సేఫ్టీ ఆఫీసర్ షైడయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెప్పులు లేకుండా నడిస్తే ఎన్ని ప్రయోజనాలో..



కౌటాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నడక చాలా మంచిది. కానీ చెప్పులు లేకుండా నడవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. చెప్పులు లేకుండా నడవడం వల్ల - శరీర భంగిమ సరిగ్గా ఉంటుంది. పొత్తి కడుపుపై ఒత్తిడి కలిగి జీర్ణ క్రియ సక్రమంగా ఉంటుంది.నేల మీద చెప్పులు లేకుండా నడవడం ద్వారా ఇసుక, చిన్న చిన్న రాళ్లు కాళ్లకు సుతిమెత్తగా కుచ్చుకోవడం వల్ల బీపీ కంట్రోల్‌లో ఉంటుంది.కొత్త స్పర్శను పాదాలు పొందడం వల్ల మైండ్ రిలాక్స్ అవుతుంది, రక్త ప్రసరణ వ్యవస్థ పని తీరు మెరుగు పడుతుంది.సర్వే ప్రకారం ఎవరైతే ప్రతి వారం కనీసం రెండు గంటలు నడుస్తారో వారు 40 శాతం మిగితా వారి కన్నా ఆరోగ్యంగా ఉంటారని వెల్లడైంది. రోజు వాకింగ్ చేయడం వల్ల ఒంట్లోని కొవ్వు కరుగుతుంది.

వయస్సును బట్టి ఇలా..

- 40 సంవత్సరాలు, అంతకన్నా తక్కువ వయస్సు - 3.75 కిలో మీటర్లు
- 45 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వరకు -3.5 కిలో మీటర్లు
-50 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాలు -3.1 కిలో మీటర్లు
- 55 నుంచి 60 సంవత్సరాలు -2.8 కిలో మీటర్లు
- 60 నుంచి అంతకన్నా ఎక్కువ గల వారు-2.5 కిలో మీటర్లు

'ఆరోగ్య' ఫలం

- సీతా ఫలంలో మాంసకృత్తులు, ఖనిజ లవణాలు
- ధర ఎక్కువైనా కొనుగోళ్లకే ప్రాధాన్యం



నస్పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన ఆరోగ్య ప్రధాయిని సీతాఫలం మార్కెట్‌లోకి వచ్చేసింది. సీతాకాల సీజన్‌లో లభించే సీతాఫలంకు మంచి గిరాకీ ఉంటుంది. సీతాఫలం పండ్లకు ధర ఎక్కువైనా నోరూరించే మధుర ఫలాలను తినాల్సిందే. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పోషకాలు ఉన్న సీతా ఫలాలను ఎక్కడ దొరికితే అక్కడికి వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ప్రత్యేకంగా సీతాకాలం సీజన్ లోనే లభించే ఫలాలపై జనాలు మక్కువ చూపుతూ ఇష్ట పడుతారు. పెద్దవి వంద రూపాయలకు ఐదు పండ్లు, చిన్నవి పది రూపాయలకు ఒకటి చొప్పున వ్యాపారులు అమ్ముతున్నారు. కిలో వంద రూపాయలకు విక్రయిస్తున్నారు. అదే విధంగా నలుబై నుంచి యాబై కాయలు కలిగిన సంచి, బుట్ట 250 రూపాయల నుంచి 300 రూపాయల వరకు అమ్మకాలు చేస్తున్నారు. మంచిర్యాల జిలాలోని వివిధ ప్రాంతాల కూడళ్ల వద్ద వ్యాపారులు సీతాఫలాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి..

జిల్లాలోని వేమనపల్లి, కోటపల్లి, చెన్నూరు, కుమరం భీం జిల్లాలోని కాగజ్‌నగర్, దహెగాం, అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, నిర్మల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి, నిజామాబాద్ జిల్లా తదితర ప్రాంతాలతో పాటు సిద్దిపేట జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు వేకువజామున లారీల్లో సీతాఫలాలను నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద అడ్డాకు తీసుకువస్తారు. ఇక్కడి నుంచే మంచిర్యాల మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం అడవుల్లో ఉన్న చెట్ల నుంచి సేకరించిన కాయలతో పాటు వివిధ ప్రాంతాల్లోని తోటల నుంచి సీతా ఫలాలను వ్యాపారులు తీసుకువస్తున్నారు. ఇలా వచ్చిన సీతాఫలాలను చిన్నచిన్న వ్యాపారులకు విక్రయిస్తారు. వ్యాపారుల చేతుల మారడంతో చిరు వ్యాపారులకు చేరే సరికి ధరలు ఎక్కువైపోతున్నాయి. జనాలకు చేరే సరికి కాయల ధరలు మరింతా పెరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో గ్రామీణ ప్రాంతాల నుంచి సీతాఫలాలు మార్కెట్‌లోకి వచ్చినట్లయితే ధరలు పూర్తిగా తగ్గుముఖం పడుతాయని చిరు వ్యాపారులు అంటున్నారు.

అనేక ఆరోగ్య లాభాలు..

ప్రకృతి ప్రసాదించిన వరప్రసాదాల్లో ఒక్కటైనా సీతాఫండ్లును తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ప్రకృతి వరప్రధాయినిగా పేరుగాంచిన సీతాఫలంలో అనేక ఆరోగ్య లాభాలు ఉన్నాయి. సీతాఫలంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు సమృద్ధిగా లభిస్తాయి. విటమిన్-సి దీనిలో సమృద్ధిగా లభిస్తుండగా కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజ లవ ణాలు పుష్కలంగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. సీతాఫలం తినడం వలన ఎముకలు చాలా బలంగా ఉంటాయని, జీర్ణక్రియ వేగవంతం కావడానికి ఉపకరిస్తుంది. మలబద్ధకానికి సీతాఫలం ఔషధంగా పనిచేస్తుంది. జలుబు, దగ్గు ఉన్న సమయంలో సీతాఫలానికి కొద్ది రోజులు దూరంగా ఉండడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ఎస్సీ విద్యార్థుల కోసం 'శ్రేష్ఠ'

(5వ పేజీ తరువాయి)

ప్రతీ సంవత్సరం ఎస్సీ విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 13,500 సీట్లు కేటాయిస్తారు. ఇందులో ప్రతిభగల 9, 11వ తరగతుల విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఆయా విద్యార్థులకు 12వ తరగతి పూర్తయ్యే వరకు ఆర్థిక సహాయం అందుతుంది. ఆ తరువాత ఉన్నత విద్యను అభ్యసించేందుకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లేదా టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కీం వంటి ఇతర పథకాల కింద ప్రయోజనం పొందేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులకు అడ్మిషన్ కల్పించేందుకు సీబీఎస్ఈ ఆధారిత అత్యుత్తమ ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఎంపిక చేస్తారు. గడిచిన మూడు సంవత్సరాల్లో 10, 12 తరగతుల్లో కనీసం 75 శాతం పాస్ పర్సెంటేజ్ సాధించిన పాఠశాలలు మాత్రమే 'శ్రేష్ఠ' స్కీం కింద ఎంపికకు అర్హత కలిగి ఉంటాయి. ప్రత్యేకంగా నియమించిన కమిటీ ద్వారా పాఠశాలల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ప్రతీ సంవత్సరం మూడు వేల మంది వరకు ఎస్సీ విద్యార్థులను పథకానికి ఎంపిక చేస్తారు. వారిలో 1500 మంది 9వ తరగతికి, 1500 మందికి 11వ తరగతికి అవకాశం కల్పిస్తారు.

● 30తో ముగియనున్న గడువు....

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా 'శ్రేష్ఠ' ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తుండగా, ఈ నెల 30తో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు గడువు ముగియనుంది. డేటా కరెక్షన్ కోసం వచ్చే నెల 1, 2 తేదీల్లో అవకావం కల్పించారు. ఎంట్రన్స్ పరీక్ష డిసెంబరులో నిర్వహించనుండగా, వ్యవధి మూడు గంటలు ఉంటుంది. ఎంట్రన్స్ ఎగ్జామ్ ముగిసిన నాలుగు నుంచి ఆరు వారాల్లో ఫలితాలు విడుదల చేస్తారు. 9వ తరగతిలో ప్రవేశం కోసం ఎనిమిదో తరగతి చదువుతూ 2010-14 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు. అలాగే 11వ తరగతిలో ప్రవేశానికి 10వ తరగతి అభ్యసిస్తున్న 2008-2012 మధ్య జన్మించిన వారికి అర్హత ఉంటుంది. కాగా ఎంట్రన్స్ పరీక్షల ఎన్‌సీఈఆర్టీ సిలబస్ ప్రకారం నిర్వహించనుండగా, మ్యాథ్స్, సైన్స్, సోషల్, జీకెకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఎలాంటి నెగెటివ్ మార్కులు ఉండవు.

రాష్ట్రంలో శ్రేష్ఠ స్కీం ప్రారంభించాలి

నయీం పాషా, సామాజిక కార్యకర్త



ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే 'శ్రేష్ఠ' పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. పథకం రాష్ట్రంలో అమలులో లేని కారణంగా ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదువుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కృషి చేస్తే వేలాది మంది విద్యార్థులకు మేలు చేకూరే అవకాశాలు ఉన్నాయి.

- ఫసల్‌బీమా ఊసెత్తని ప్రభుత్వం
- ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు తీవ్ర నష్టం
- ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాతలు

యాసంగికైనా అమలయ్యేనా?



నెన్నెల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) రాష్ట్రంలో అమలు కావడం లేదు. నష్టపోయిన పంటకు బీమా వర్తించకపోగా.. ప్రభుత్వం సైతం పరిహారం ఇవ్వడంలేదు. బీమా లేకపోవడంతో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగినప్పుడల్లా రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలతో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి రైతులకు పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి ఉంది. మరో పది రోజుల్లో యాసంగి సాగు పనులు, నెల రోజుల్లో మామిడి పంట సీజన్ ప్రారంభం కానుంది. బీమా యాసంగికైనా అమలుచేస్తారని భావించగా, ఇంత వరకు మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ సీజన్ నుంచైన బీమా ధీమా కల్పించాలని రైతులు కోరుతున్నారు.

● కొంతైన ఉపశమనం..

పంటలకు బీమా చేసేందుకు అప్పట్లో ప్రకటన ఇచ్చి రైతుల నుంచి ప్రీమియం వసూలు చేసేవారు. వరికి గ్రామం యూనిట్‌గా, మక్క, కంది, పెసర, మినుము, సోయా వేరుసెనగకు మండలం యూనిట్‌గా బీమా అమలయ్యేది. మామిడికి వాతావరణ ఆధారిత బీమా చేసేవారు. బ్యాంకుల నుంచి రైతులు పంట రుణం తీసుకునే సమయంలోనే వానాకాలంలో 2 నుంచి 5 శాతం, యాసంగిలో 1.5 నుంచి 5 శాతం ప్రీమియం మినహాయించుకొని మిగతావి రైతులకు ఇచ్చేవారు. పంట నష్టపోతే వరికి ఎకరానికి రూ. 37,484, పత్తికి రూ. 36,282, మక్కకు రూ. 18,742 పరిహారం చెల్లించేవారు. నష్టపోయిన రైతులకు కొంతలో కొంత ఉపశమనం కలిగేది. అయితే కొన్నేళ్లుగా రాష్ట్రప్రభుత్వం బీమా కోసం నోటిఫికేషన్ ఇవ్వడం లేదు.

● 2019 నుంచి నిలిపివేత

అన్నదాతకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజనను తీసుకువచ్చింది. ఈ పథకం పలు రాష్ట్రాల్లో కొనసాగుతుండగా, తెలంగాణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. 2019-20 వరకే రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలైంది. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. పీఎంఎఫ్‌బీవైలో చేరడంతో పాటు మెరుగైన పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని సీఎం చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సీజన్‌లు దాటిపోయినా అన్నదాతకు బీమా లభించడం లేదు.

● మామిడిది అదే దారి...

జిల్లాలో పత్తి, వరి తరువాత ప్రధాన పంట మామిడే.దాదాపు 20 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. యేటా అకాల వర్షాల వల్లనో.. ఈదురుగాలుల కారణంగానో మామిడి పంటకు నష్టం వటిల్లుతోంది. కొన్నాళ్లపాటు ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా అమలు చేసింది. స్వల్ప ప్రీమియంతో రైతులకు బీమా వర్తించేది. 5 నుంచి 15 సంవత్సరాల తోటలకు ఒక్కో చెట్టుకు 26 రూపాయలు, 16 నుంచి 50 సంవత్సరాలలోపు మామిడి చెట్లకు ఒక్కోదానికి 46 రూపాయల ప్రీమియం చెల్లించేవారు. రైతులు చెల్లించిన ప్రీమియాన్ని రెంట్టింపు చేసి మిగితా మొత్తం ప్రభుత్వం భరించేది. అకాల, అధిక వర్షాలకు, చీడపీడలు ఎక్కువైనప్పుడు, రోజువారీ ఉష్ణోగ్రతల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నప్పుడు, గాలిదుమారాలు సంభవించి నష్టం వాటిల్లినప్పుడు పరిహారంగా చిన్న చెట్లకు 420 రూపాయలు, పెద్ద వాటికి 820 రూపాయలు బీమా కంపెనీ చెల్లించేది. దీంతో రైతుల తమనష్టాన్ని కొంతవరకు పూడ్చుకునేవారు. మరో నెలరోజుల్లో సీజన్ పనులు ప్రారంభమవుతాయని, ఇప్పటికైనా వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని పునరుద్ధరించాలని మామిడి రైతులు కోరుతున్నారు.

● బీమా లేదు.. పరిహారం రాదు..

పంటల బీమా అమలు చేయకపోవడంతో ప్రతీ ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భారీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రతీసారి పంటల బీమా కోసం రైతులు ఎదురుచూస్తున్నా అమలుకు నోచుకోవడంలేదు. దీంతో ప్రకృతి విపత్తుల సమయం లో రైతులకు ఆసరా కరువైంది. మరోవైపు పంటలు దెబ్బతిన్నప్పుడు ఎకరాకు 10,000 రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇంతవరకు ఏ ఒక్కసారి పరిహారం వచ్చిన దాఖలాలేదు. వెరసి బీమా లేక.. పరిహారం రాక రైతులు రెండు విధాల నష్టపోతున్నారు.

ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి దంపతులు

దండెపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి దంపతులు పెద్దయ్య దేవుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దండెపల్లి మండలం మామిడిపల్లి గ్రామపంచాయతి పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దయ్యను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఇటీవల కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆయన ఆరోగ్యంగా ఉండాలని స్వామివారిని వేడకున్నట్టు చెప్పారు. ఆలయ పూజారులు చైర్మన్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందిచారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మందమర్రిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అనుబంధ సంస్థల విద్యార్థులకు మూడు రోజులుగా హన్మకొండ క్యాంపస్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో మందమర్రి మిమ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో మందమర్రికి చెందిన ఆడెపు రుషికుమార్, అంకం శ్రీకర్, ఉప్పు అఖిల్ ద్వితీయ బహుమతులు సాధించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులను ఆదివారం అభినందించారు.

ఎమ్మెల్యే ఆరోగ్యంపై వదంతులను నమ్మవద్దు





మంచిర్యాల, లక్షెట్టిపేటలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆరోగ్యంపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ అన్నారు. ప్రేంసాగర్‌రావు నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆరోగ్యం కుదుట పడిందని, మరికొన్ని రోజుల్లోనే మంచిర్యాల నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. ఆరోగ్యంపై వస్తున్న వదంతులను ప్రజలు, కార్యకర్తలు విశ్వసించవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ ముని, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, పెంట రజిత, హేమలత, సుర్మిల్ల వేణు, సంతప్‌రెడ్డి, డేగ బాపు, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ..

లక్షెట్టిపేట: పట్టణంలోని రైతు వేదికలో లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చెక్కులను పంపిణీ చేయాల్సి ఉండగా ఆరోగ్యరీత్యా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆయన సూచన మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందించామన్నారు. రెండు మండలాలకు చెందిన సుమారు 95మంది లబ్ధిదారులకు 24లక్షల నాలుగువేల రూపాయల విలువైన చెక్కులను నాయకులతో కలిసి అందించామని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, దండేపల్లి మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రవీందర్ రావు, తోట రమేష్, నాయకులు తిరుపతి, సందెల సురేష్, మడిపెల్లి స్వామి, లబ్ధిదారులు తదతరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం

చెన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతంలో ప్రకృతి ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సత్య ప్రకృతి వైద్యశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఎంపీకి వైద్యశాల యాజమాన్యం పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నేటి కాలంలో ప్రకృతి వైద్యం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. నేచురల్‌లైఫ్‌ను ఈ కాలంలో మనం వాడుకోవడం లేదన్నారు. ఇప్పుడు అన్నింటిలోను కెమికల్స్ వాడకం విపరీతంగా జరుగుతుందన్నారు. ఈ ప్రకృతి వైద్యశాల అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. నేచురల్ పద్ధతిలో వైద్యం అందించి రోగాల నివారణ కృషి చేస్తున్న ఆసుపత్రి సేవలు అమోఘమన్నారు. ప్రజలు ప్రకృతి వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక మదన పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ప్రకాష్ అమ్తే, డాక్టర్ సత్యలక్ష్మీ, వైద్యశాల యామాన్యం, ప్రజలు పాల్గొన్నారు.

'గాలికుంటు'పై టీకాస్త్రం..

(5వ పేజీ తరువాయి)

వ్యాధి నిరోదక టీకాలు తప్పకుండా వేయించాలి.

- పశువుల కొట్టాలను క్రిమి సంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం ఫార్మలిన్, 4 శాతం సోడియం కార్బనేట్ వంటి మందులతో శుభ్రం చేయడం వల్ల వైరస్ నశిస్తుంది.

● చికిత్స..

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేసి సత్వరం చికిత్స చేయించాలి.
- పొటాషియం పరమాంగనేటు నీటితో పుండ్లను శుభ్రం చేయాలి. అనంతరం నోటి పుండ్లకు బోరోగ్లిజరిన్, కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లోడాక్సిన్, హిమాక్స్ వంటి అయింట్‌మెంట్లు పూయాలి. ఈగలు వాల కుండా వేపనూనె నిమ్మింట్ వంటి మందులను వాడాలి.
- అంటీబయాటిక్స్ మందులను మూడు నుంచి ఐదు రోజులు వాడాల్సి ఉంటుంది.

పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి

- డాక్టర్ ఈ శంకర్, జిల్లా పశు వైద్యాధికారి



పశువుల ఆరోగ్యాన్ని దెబ్బతీసే గాలికుంటు వ్యాధిని ముందు జాగ్రత్తతో నివారించవచ్చు. ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా టీకాలు వేస్తున్నాం. జిల్లాలో 2,44,663 డోసులు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈనెల 15న ప్రారంభమైన ఈ కార్యక్రమం నవంబరు 14వరకు కొనసాగుతుంది. మూడు నెలలు నిండిన పశువులన్నింటికి టీకాలు వేయించాలి. విడతల వారిగా అన్ని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తాం.

మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షించిన నాయకులు

దండేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మ్యాదరిపేటలోని ఓ ఫంక్షన్ హాలులో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పలువురు బీజేపీ నాయకులు వీక్షించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో పాటు బీజేపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన కొమురంభీం గురించి ప్రధాని ప్రస్తావించడంతో ఆయనకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్, జిల్లా, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి పంచాయతీలో దివంగత బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ నివాసంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కంపెల అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం నాయకులు వీక్షించారు. మండలంలోని ఇతర బూత్‌లలో కూడా కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మదునయ్య, కిశోర్, స్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షిస్తున్న నాయకులు

నర్సరీల్లో ఎండిపోతున్న మొక్కలు

- కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలు - ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది తొలగింపు - నర్సరీల్లో నిర్వహణ కరువు



నర్సరీలో ఎండిపోతున్న మొక్కలు

హాజీపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోతున్నాయి. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్న హాజీపూర్ మండలంలోని నంనూర్, నర్సింగాపూర్, గుడిపేట్, వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లోని నర్సరీల్లో వేలాది మొక్కలను అధికారులు పెంచారు. 15 రకాల అడవి, తీగ జాతి, పూలు, పండ్ల మొక్కలకు సంబంధించిన విత్తనాలను సేకరించి ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచి గ్రామాల్లో, అడవిలో, ఖాళీ ప్రదేశాల్లో నాటేవారు. ఈ గ్రామాలు ఇటీవల నూతనంగా ఏర్పడిన మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం అయ్యాయి. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బందిని తొలగించారు. దీంతో నర్సరీల నిర్వహణ పట్టించుకునే వారు కరువయ్యారు. లక్షలు వెచ్చించి పెంచి నాటాల్సిన మొక్కలు నేడు నీరు పోసే వారు లేక ఎండిపోతున్నాయి. బల్దియా అధికారులు వీటి సంరక్షణ చేసే ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా కాళీమాత నిమజ్జనం

మందమర్రిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళినగర్‌లో గత కొన్ని రోజులుగా ప్రత్యేక పూజలందుకున్న కాళీమాత విగ్రహాన్ని బెంగాళీలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

ఈ సందర్భంగా కాళినగర్, మందమర్రి మార్కెట్, బీజోన్‌లలో కాళిమాత విగ్రహ శోభాయాత్రను నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాళిమాతను దర్శించుకుని ప్రజలు పూజలు చేశారు. ప్రతియేటా దీపావళికి కాళినగర్‌లో బెంగాళీలు కాళిమాతను ప్రతిష్ఠించి పూజలు చేస్తుంటారు. అనంతరం గోదావరి నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కాళిమాత శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బీజేపీలో పలువురి చేరికలు



పార్టీలో చేరిన వారితో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

కాసిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్‌లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మైనార్టీ నాయకులు 50 మంది ఆదివారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాధ్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. ఓరియంట్‌సిమెంట్ కంపెనీ కార్మికులు, మైనార్టీ యువకులు, నాయకులు బీజేపీ పార్టీలోచేరడంతో పార్టీ బలపడిందని రఘునాధ్ తెలిపారు.పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతం కృషి చేయాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడునగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, నాయకులు పోశన్న, సంతోష్, కిరణ్, రమేష్, మహేష్, పర్వతాలు, రమేష్, హనీఫ్, హరీఫ్,గౌస్,జమీర్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజ పరిరక్షణకు కృషిచేయాలి



కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

తాండూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషిచేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తాండూర్‌లో ఆదివారం సభ్యులు భారీ కవాతు నిర్వహించారు. కిష్టంపేట విద్యాభారతి హైస్కూల్ నుంచి ప్రారంభమైన కవాతు ఐబీ చౌరస్తా మీదుగా జాతీయ రహదారి మీద కొనసాగింది. స్థానికులు, మహిళలు పూలు చల్లుతూ, మంగళహారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ గ్రామ గ్రామాన స్వయం సేవక్ సంఘ్ విస్తరించాలన్నారు. ఆర్ఎస్ఎస్ దేశాభివృద్ధి కోసం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం అభివృద్ధికి విరాళం

భీమారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కోదండరామాలయం అభివృద్ధికి ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ రూ. 1,11,116 చెక్‌ను ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు 30 వేల రూపాయలు, ప్రహరీ నిర్మాణానికి 81,116 రూపాయలు మొత్తం 1,11,116 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు భూక్య రాజ్‌కుమార్ నాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను పోరాడి సాధించుకోవాలి





సమావేశంలో మాట్లాడుతున్న అన్నెల లక్ష్మణ్, మాట్లాడుతున్న రజక సంఘం నాయకుడు సంగెపు ఎల్లన్న

మంచిర్యాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడి బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ అన్నారు. ఆదివారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం చేర్చాలని, రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపెల్లి చంద్రశేఖర్, రేగుంట రాకేష్, ఏదునూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర యూత్ రజక సంఘం గౌరవ అధ్యక్షుడు సంగెపు ఎల్లన్న అన్నారు. పట్టణంలోని రజక సంఘం కమ్యునిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, బీసీ ఈ రిజర్వేషన్ 14 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సంగపల్లి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు సంగం లక్ష్మణ్, నాయకులు కంచర్ల కొమురయ్య, కొలిపాక రమేష్, శంకర్ ఉన్నారు.



పత్తి రైతుకు దుఃఖం

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట
- చాలా చోట్ల కుళ్లిపోయిన కాయలు
- తగ్గనున్న దిగుబడి
- పెట్టుబడి కూడా రాని దుస్థితి
- ఆందోళనలో అన్నదాతలు

పత్తి రైతులు దుఃఖంలో మునిగిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. వానాకాలం సీజన్ ప్రారం భంలో పడిన వర్షాలను చూసి మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశలు పెంచు కున్నారు. గతనెలలో కురిసిన ఎడతెరిపి లేకుండా పడిన వర్షాలకు పంట దెబ్బతిన్నది. ఆపసోపాలు పడుతూ వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటకు కాపాడుకున్నా దిగుబడులు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


బెజ్జూరులో సాగు చేస్తున్న పత్తి

బెజ్జూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) వరుణుడి దెబ్బకు పత్తి రైతులు కుదేలవు తున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలు దెబ్బతింటున్నాయి. వానా కాలం ప్రారంభంలో వర్షాలు లేక దిగాలు చెందిన చెందిన రైతులు మధ్యలో వర్షాలు కురవ డంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఇటీవల కురిసిన వరుస వర్షాలతో చేతికి వచ్చిన పత్తి పంటలు తడవడంతో తెల్లబంగారం అంతా నల్లబో వడంతో పత్తి రైతులు బోరుమంటున్నారు. పంట చేతికొచ్చే సమయానికి చేలల్లోనే నల్లబడ డంతో పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని వాపోతు న్నారు. దీనికి తోడు పత్తి తీతకు కూలీ రేట్లు పెంచ డంతో పత్తి రైతు ఆందోళన చెందుతున్నాడు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవే దనకు గురవుతున్నారు. ఇన్నాళ్లు వెక్కిరించిన కరువుస్థానం లో అతివృష్టి నెలకొనడంతో జిల్లా రైతాంగాన్ని ఆందో ళనకు గురి చేస్తోంది.

● గత నెలలో కురిసిన వర్షాలకు..

సెప్టెంబరులో ఎడతెరపి లేకుండా కురిసిన అధిక వర్షాలకు పత్తి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 10నుంచి 12క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అనుకున్న రైతులకు కేవలం ఐదు క్వింటాళ్ల మాత్రమే వచ్చేలా ఉందని, కొన్నిచోట్ల ఆమాత్రం కూడా దిగుబడి రాలేని స్థితిలో ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల ప్రభావంతో పత్తి నలుపు రంగులోకి మారిందని, దీంతో మార్కెట్‌లో వ్యాపారులు తేమ, నాణ్యత పేరుతో పత్తి ధరను అమాంతం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితులు నెలతకొన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధిక వర్షాలకు తోడు సిర్పూర్ నియోజకవర్గంలో ప్రాణ హిత నదికి బ్యాక్ వాటర్ వరద పోటెత్తడంతో తీర ప్రాంతాల్లోని పత్తి పంట పలుమార్లు వరద నీటిలో మునిగి పోయింది. ఆదిలోనే తీర ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోగా, మరోసారి రైతులు విత్తనాలు విత్తుకొని సాగు చేయగా అధిక వర్షాలు మరోసారి నష్టాన్ని మిగిల్చాయని రైతులు ఆందో ళనకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా పంటలు వరద నీటిలో మునిగిపోగా వ్యవసాయ శాఖ సర్వేలు నిర్వహించి 6,704ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. కానీ పంట నష్టం జరిగి, సర్వే రిపోర్టు ప్రభుత్వానికి అం దజేసి నెలరోజులకు పైగా గడుస్తున్నా ఇప్పటికి పరిహారం రైతులకు అందలేదు.

● సీజన్ ప్రారంభంలో..

వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు కాస్తా దోబూచులాడినా, వర్షాలు పడిన వెంటనే రైతులు పత్తి పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. కుమ రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 3.50లక్షల ఎకరాలకు పైగా సాగు చేశారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కురిసిన వరుస వర్షాలకు పత్తి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఒక్కో ఎకరాకు 12క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంట అధిక వర్షాలకు 5క్వింటాళ్లకు దిగుబడి పడిపోయింది. పంట ప్రారంభ దశలో పత్తి పంటకు అనుకూలమైన వర్షాలు కుర వడంతో పంట పెట్టుబడికి వెనక్కి పోకుండా అప్పులు తెచ్చి ఎరువులు వేశారు. పంటకు చీడ, పీడలు ఆశి స్తున్న క్రమంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంట లను కాపాడుకున్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి వరుస వర్షాలు కురవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి, పత్తి కాయలు మురిగిపోయి దిగుబడి తీవ్రంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

● అదనపు భారం..

పత్తి రైతులకు పెరిగిన కూలీ రేట్లు మూలిగే నక్క పై తాటికాయ పడినట్లుయింది. అధిక వర్షాలతో దిగు బడి నష్టపోయిన రైతులకు కూలీల రేట్లు పెంచడం అదనపు భారంగా మారింది. ఒక్కో కూలీకి రూ.300 ఆటో కిరాయి, రూ.2వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఎకరానికి పత్తితీతకు సుమారు 40నుంచి 50మంది కూలీలు అవసరం పడు తుంది. ఒక్కో కూ లీకి కిలో పత్తి తీతకు రూ.10నుంచి రూ.12వరకు అడుగుతున్నా రని రైతులు చెబుతున్నారు. ఇలా అన్ని ఖర్చులు కలుపుకొని సుమారు రూ.25వేల వరకు అవుతుంది. ఎకరంలో ఐదు క్వింటాళ్ల పత్తి మాత్రమే వస్తుండగా ఇక రైతులకు మిగిలేది ఏం లేదని వాపోతున్నారు.

● మద్దతు ధరపైనే ఆశలు..

పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాణ్యత, తేమ సా కు చూపకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,120చెల్లిస్తేనే రైతుకు పంటపై పెట్టిన పెట్టుబడి వచ్చేలా ఉందని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధరపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యత, తేమ అని చూడకుండా రైతులకు ప్రభుత్వ మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్టుబడులు వచ్చేలా లేవు..

- చటారి హన్మంతు, రైతు, ఎల్కపల్లి



ఈ యేడు పత్తి పంటపై లాభాలు వస్తాయని అనుకున్నా. అధిక వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బ తిన్నది. ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. ప్రభుత్వం మద్దతు ధర పెంచి సీసీఐ కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి. పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

గుస్సాడీ కనకరాజుకు ఘన నివాళి



కనకరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు

జైనూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత గుస్సాడీ కనకరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం గ్రామస్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ప్రతిభ మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత గుస్సాడీ కనకరాజు ఆదివాసీల దైవం దండారి దేవతలు(గుస్సాడీ గురువు),ఆదివాసీల అతిప్రచీనమైన సంస్కృతి సంప్రదాయలను ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడని కొనియాడారు. గుస్సాడీ కనక రాజు మన మధ్యలేకున్నా ఆయన చేసిన సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయలను పరిరక్షించి భావితరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కనకరాజు భార్య కనక భీమ్‌బాయి, కనక తుకారాం, గ్రామ పటేల్ ఆత్రం హన్మంత్ రావు, ఉపాధ్యాయులు కనక సోనేరావు, ఆర్క మోతిరాం, కనక వెంకటేశ్వర్‌రావు, వీవో అధ్యక్షురాలు కనక రూపబాయి, మండల సర్మేడి దేవ్‌రావు, గ్రామస్థులు సావిత్రి, దర్మేందర్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారితో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, అన్నపూర్ణ మురళీగౌడ్, శ్రీకాంత్, సింగల్‌గూడ, పుంజుమేరగూడ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 100 మంది నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యకర్తలు పార్టీ పటిష్టతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేశ్, చరణ్, మదునయ్య, కలీంబాయ్, శాంతిగౌడ్, సంతోష్‌బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో ఒక బాలికకు ఆదివారం నిశ్చితార్థం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన బృందం, పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణాధికారి మహేష్ మాట్లాడుతూ మైనర్లకు వివాహం చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలని చెప్పారు. బాల్య వివాహం నిర్వహిస్తే లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్షకు గురవుతున్నారు. ఇలాంటి వివాహాల్లో పాల్గొన్న పెద్దలు, పురోహితులు, బంధువులు, పెళ్లికుమారుడు, వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. బాల్య వివాహాలు బాలల భవిష్యత్‌ను దెబ్బతీస్తాయని చెప్పారు. విద్య, ఆరోగ్యం, సురక్షిత వాతావరణం కల్పించి పిల్లల భవిష్యత్ కోసం తల్లి దండ్రులు, పెద్దలు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం అందించాలన్నారు. బాలిక కుటుంబీలకు కౌన్సెలింగ్ నిర్వహించి సఖీ కేంద్రానికి తరలించారు. కార్యక్రమం లో చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, కానిస్టేబుల్ సంతోష్, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి భూమి పూజ


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్ వైఎస్ఆర్ కాలనీలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను సన్మానించారు.

కెరమెరి రైతుకు అవార్డు


అవార్డు అందుకుంటున్న రైతు బాలాజీ

కెరమెరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న రైతు బాలాజీకి అవార్డు లభించింది. రైతునేస్తం ఫౌండేషన్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ స్వర్ణభారత్ ట్రస్ట్ భవనంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో కెరమెరి మండలం ధనోరకు చెందిన రైతు బాలాజీ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయకుడు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బాలాజీ ఆపిల్‌బార్, చిరు ధాన్యాలు సాగు చేస్తూ ఇతర రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమంలో రైతు కుంరం నానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

సిర్పూర్(టి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన డోంగ్రే అరుణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌కెఈ డిగ్రీ కాలేజీ పూర్వ విద్యార్థులకు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.15 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో విజయ్, హబీబ్, శ్రావణ్, గుణవంతు, శ్రీనివాస్, మల్లేష్, లింగమూర్తి, మల్లేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

త్వరలోనే కార్యాచరణ

కాగజ్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు పేపర్ మిల్స్ ట్రేడ్ యూనియన్ నెంబరు ఈ 966 అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని సిర్పూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ లెండుగురే శ్యాం ప్రకటించారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. త్వరలోనే ట్రేడ్ యూనియన్‌పై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎస్పీఎం కార్మికులకు ఎళ్లవేళలా అండగా ఉంటామని ప్రకటించారు. కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వివరించారు.

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

కెరమెరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబరావుగూడ గ్రామ సమీపంలో వర్షాకాలం కురిసిన వర్షాలకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ప్రధాన రహదారి ఓ వైపు కోతకు గురైంది. దీంతో పెద్ద గుంత ఏర్పడింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతకు ఓ వైపు గొయ్యి, మరో వైపు చెట్ల పొదళ్లు ఉండడం వల్ల వాహనదారులకు అక్కడ గుంత ఉన్నట్లు కనిపించడం లేదు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ వరకు ఒకే రోడ్డు మార్గం ఉంది. ప్రతి నిత్యం ఈ రోడ్డుమీదుగా పెద్ద వాహనాలు రాక పోకలు సాగిస్తాయి. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయాలని కోరుతున్నారు.

రెండు బైకులు ఢీ..నలుగురికి గాయాలు

బెజ్జూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆదివారం బెజ్జూరు మండలం ఇందుర్‌గాం, కుశ్నపల్లి గ్రామాల మధ్య రెండు బైకులు ఢీ కొనడంతో నలుగురికి తీవ్ర గయాఆలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుర్‌గాంకు చెందిన సెండె లక్ష్మణ్, లక్ష్మీ, నికాడి నిర్మలలు ముగ్గురు ఒకలిసి ఒకే ద్విచక్ర వాహనంపై బెజ్జూరుకు వస్తుండగా కుశ్నపల్లి గ్రామానికి చెందిన కడప విజయ్ నాగులువాయి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కరమంలో కుశ్నపల్లి చెరువు వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ క్రమంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా విజయ్, లక్షమణ్‌ల పరిస్థితి విషమంగా మారింది. గాయ పడ్డ వారిని బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు లక్ష్మణ్, లక్ష్మీ, విజయ్‌ని కరీంనగర్‌కు తరలించగా నిర్మలను మంచిర్యాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సర్తాజ్‌పాషా సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న నాయకులు

కౌటాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం తలోడి ఆశ్రమంలో రైతులు పొలం పనులకు వెళ్లే ఊర చెరువు రోడ్డు వర్షాలకు గుంతలు పడి బురద మయంగా మారడంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు చేశా రు. ఈ సందర్భంగా రైతులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాంచందర్, బాపు, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పల్లె ప్రకృతి వనం


దర్గపల్లి పల్లె ప్రకృతివనంలో ఉన్న పశువులు

పెంచికలపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతా వరణం కల్పించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి పల్లె ప్రకృతి వనాలను గ్రామాల్లో ఏర్పాటు చేసింది. అయితే సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయిన తరువాత పల్లె ప్రకృతి వనాలపై నిర్లక్ష్యపు నీడ ఏర్పడింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రకృతి వనాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని దర్గపల్లి గ్రామ పల్లె ప్రకృతి వనంలో పశు వులు చొరబడి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. పల్లె ప్రకృతి వనం కంచె ధ్వంసమైంది. పల్లె ప్రకృతి వనం గేటు తాళాలు వేసి సంవత్సరాలు గడుస్తుండ డంతో ప్రజలు వెళ్లలేని పరిస్థితి ఉంది. అయితే ప్రజలకు నో ఎంట్రీ.. పశువులకు ఫ్రీ ఎంటీ అన్నట్లుగా దర్గపల్లి పల్లె ప్రకృతి వనం తయారైంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మధుకర్‌ను ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

● మహారాష్ట్రకు తరలిస్తున్న అక్రమార్కులు

సిర్పూర్(టి), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దు మండలమైన సిర్పూర్(టి)లో రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ జోరందుకుంది. పేదలకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని కొందరు మహారాష్ట్ర మార్కెట్‌లకు తరలిస్తున్నారు. సెప్టెంబరు నుంచి అక్టోబరు మధ్యకాలంలో వరుస దాడులు జరిపిన అధికారులు మొత్తం 150 క్వింటాళ్లకు పైగా బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. చెక్ పోస్టులు, రైల్వే స్టేషన్, రైస్ మిల్లులు, రేషన్ దుకాణాల వరకు ఈ దందా విస్తరించిందని విచారణలో తేలింది. సిర్పూర(టి) సరిహద్దు గ్రామం కావడంతో అక్రమ రవాణా దారులు ప్రధానంగా వెంకట్రావుపేట్ మీదుగా పోడ్సా, రైలు మార్గం మీదుగా వీరూర్, రాజురా ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై కైడా దందా కొనసాగిస్తున్నారు. కొందరు డీలర్లు స్థానిక రేషన్ షాపుల నుంచే బియ్యంను కొనుగోలు చేసి మాఫియాలకు అందజేస్తున్నారు. తహసీల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ రేషన్ బియ్యం విక్రయిం చినట్లయితే మూడు సార్లు పట్టుబడితే లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేస్తామన్నారు. పేదలకు కడుపునింపుకోవడానికి పంపిణీ చేస్తున్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలని దుర్వి నియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిం చారు.


సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం(ఫైల్)

ఇటీవల ఇలా..

- సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ వద్ద సెప్టెంబరు 5న తనిఖీల్లో 25 క్వింటాళ్ల బియ్యం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- మండలంలోని మద్దెల వాగు సమీపంలోని రైస్ మిల్లులో సెప్టెంబరు 12న సుమారు 100 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి.
- పారిగాం రేషన్ డీలర్ వ్యవహారంలో అక్టోబరు 10న 12.92 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం.
- రైల్వే స్టేషన్ వద్ద అక్టోబరు 14న 3.05 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
- వెంకట్రావుపేట చెక్‌పోస్టు వద్ద అక్టోబరు 17న 5.03 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

ప్రత్యేక బృందాల ఏర్పాటు..



రైల్వే స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలువురిపై 6(ఏ) కేసు నమోదు చేశాం. పారిగాం ఘటన, మద్దెలవాగు ఘటనలతో అధిక మొత్తం బియ్యం దందా వెలుగులోకి రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, పోలీసు శాఖలు పూర్తి స్థాయిలో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెడుతున్నాం. అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుం టాం. పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తాం.

- ఎస్సై సురేష్, సిర్పూర్(టి)